## ఘనంగా "పొన్నం సత్తయ్య స్టీల్ బ్యాంక్" ప్రథమ వార్షికోత్సవ వేడుకలు



**భీమదేవరపల్లి, జూలై 17:** భీమదేవరపల్లి మండల కేంద్రంలో "పొన్నం సత్తయ్య స్టీల్ బ్యాంక్" ఏర్పాటై విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమానికి భీమదేవరపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:"సంవత్సరం క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని విలేజ్ ఆర్గనైజేషన్ సంఘాలకు ఉచితంగా స్టీల్ బ్యాంక్ వస్తువులను అందజేశారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు, మహిళా సంఘాల బలోపేతానికి ఈ స్టీల్ బ్యాంక్ ఎంతో దోహదపడుతోంది. ఈ వేడుకల్లో ఏపీఎం వేణు, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆదరి రవి, ఊసకోల ప్రకాష్, అశోక్ ముఖర్జీ, సదానందం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్రవంతి, వివిధ గ్రామాల వివో ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు



**భీమదేవరపల్లి జూలై 18 :** ఎలినో ఎఫెక్ట్ కారణంగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వర్షాలు లేనందున, రైతులు సాంప్రదాయ వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. శుక్రవారం కొప్పూర్ గ్రామంలో రైతులకు వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా వర్షాలు పడే సూచనలు తక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. భూగర్భ జలాలు (గ్రౌండ్ వాటర్ లెవెల్స్) గణనీయంగా తగ్గుతుండటం వల్ల భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తి కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితులను అధిగమించడానికి తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవడమే ఉత్తమ మార్గమని తెలిపారు. వరికి బదులుగా తక్కువ నీటి ఎద్దడిని తట్టుకునే కంది, పెసర్లు, బొబ్బర్లు, మినుములు వంటి ఆరుతడి పంటలను వేసుకోవాలి. ఉద్యానవన పంటలు: ఆసక్తి గల రైతులు కూరగాయల సాగు, ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపడం ద్వారా లాభాలు అర్జించవచ్చు. ప్రభుత్వం తరపున రైతులకు సబ్సిడీ కింద కంది విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొప్పూరు గ్రామ సర్పంచ్ గద్దల కుమారస్వామి, ఏఈఓ క్రిసోలైట్, రైతులు, తదితరులు పాల్గొన్నారు..

# పుష్కర ఘాట్లును పర్వేక్షించిన ఆర్డీవో






**ఇబ్రహీంపట్నం జూలై 17 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కోమటి కొండాపూర్, ఎర్దండి, గోదావరి తీరం పుష్కర ఘాట్లును పర్వేక్షించిన ఆర్డీవో, మరియు నక్ష భూమీ సర్వే గ్రామ సభ నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఇబ్రహీంపట్నం తహసిల్దార్ ప్రసాద్, కోమటి కొండాపూర్ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరి బాధ్యత

**లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్**



**ధర్మపురి, ( ప్రజా మంటలు ) జూలై 17:** అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ధర్మపురి కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా న్యాయ సేవల సంస్థ (ఋూూూ) ద్వారా ఆర్థికంగా బలహీనులు, చట్ట ప్రకారం అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు జిల్లా న్యాయ సేవల సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు, కార్మికులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన అర్హులైన వ్యక్తులు తమ న్యాయ హక్కులకు సంబంధించిన సమస్యలపై జిల్లా న్యాయ సేవల సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. "న్యాయం ప్రతి పౌరుడి హక్కు. చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజలు తమ హక్కులతో పాటు విధుల పట్ల కూడా అవగాహన పెంపొందించుకొని, అవసరమైన సందర్భాల్లో న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి" అని జాజాల రమేష్ పేర్కొన్నారు

## జగిత్యాల కోర్టులో మరో..సంచలన తీర్పు

**భర్తను హత్య చేసిన భార్య**

**యావజ్జీవ కారాగార శిక్ష, - రూ.10 వేల జరిమాన**



**( చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల):** జగిత్యాల జిల్లా కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో జరిగిన భర్త హత్య కేసులో నిందితురాలికి శుక్రవారం జగిత్యాల ప్రధాన జిల్లా, సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కేసు వివరాలు: 2022 నవంబర్ 11వ తేదీ రాత్రి కొడిమ్యాల గ్రామంలో బత్తుల శ్రీను తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో, అతని భార్య బత్తుల ప్రమీలకు ఉన్న అక్రమ సంబంధం నేపథ్యంలో వివాదశీ జరిగింది. అనంతరం శ్రీనును హత్య చేసి, సంఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని చీరతో ఉరివేసుకున్నట్లు కనిపించేలా ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొడిమ్యాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఈ కేసును మొదట బి. కోటేశ్వర్, అప్పటి సీఐ దర్యాప్తు చేయగా, అనంతరం డి. రమణమూర్తి, సీఐ దర్యాప్తును పూర్తి చేసి కోర్టు కి ఆధారాలు సమర్పించారు. పిపి రామకృష్ణారావు, కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టగా సాక్షులను విచారించారు. జగిత్యాల ప్రధాన జిల్లా, సెషన్స్ జడ్జి రత్న పద్మావతి శుక్రవారం (17-07-2026) తీర్పు వెలువరిస్తూ, నిందితురాలు బత్తుల ప్రమీలను దోషిగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించింది. పై కేస్ లో నిందితురాలుకి శిక్ష పడటంలో కృషి చేసిన పీపీ రామకృష్ణారావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ లు కోటేశ్వర్, రమణమూర్తి, సి.యం.ఎస్. ఎస్.ఐ శ్రీకాంత్ , కోర్ట్ కానిస్టేబుల్ హరీష్, సి.యం.ఎస్. కానిస్టేబుల్ కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ హెచ్చరికతోనే సింగరేణిలో మెడికల్ బోర్డు

**డిపెండెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరినీ అన్‌ఫిట్ చేయాలి: టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ నేతలు**




**హైదరాబాద్, జూలై 17 (ప్రజా మంటలు):** డిపెండెంట్ ఉద్యోగాల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని, లేకపోతే నిరవధిక దీక్ష చేపడతానని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించడంతోనే సింగరేణి యాజమాన్యం దిగివచ్చిందని టీఆర్ఎస్ నేతలు రియాజ్, మాజీ మంత్రి బోడ జనార్ధన్ అన్నారు. బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ మెడికల్ బోర్డు నిర్వహించి, గతంలో మాదిరిగానే అన్‌ఫిట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ది దరిద్రపు పాలన: రియాజ్కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హెచ్ఎంఎస్ నేత రియాజ్ ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికుల కుటుంబాల ఆశలపై నీళ్లు చల్లే కుట్ర జరుగుతోందని అన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు, అలియాస్ పేర్ల అంశంలో కార్మికులను మోసం చేశారని విమర్శించారు. కల్వకుంట్ల కవిత రెండుసార్లు బొగ్గుబాయి కార్యక్రమంలో పాల్గొని కార్మికుల తరఫున పోరాటం ప్రారంభించిన తర్వాతే ప్రభుత్వంలో కదలిక వచ్చిందని రియాజ్ అన్నారు. కార్మికులు తమ సమస్యలను కవిత దృష్టికి తీసుకెళ్లారని, దీంతో సమస్య పరిష్కారం కోసం ఆమె నిరవధిక దీక్షకు సిద్ధమయ్యారని చెప్పారు. కవిత హెచ్చరికల నేపథ్యంలోనే మెడికల్ బోర్డు ఏర్పాటు ప్రకటన వెలువడిందని పేర్కొన్నారు. కేవలం 130 మంది జాబితాకు పరిమితం కాకుండా, డిపెండెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న మొత్తం సుమారు 2,000 మంది అభ్యర్థుల ప్రక్రియను పూర్తి చేయాలని రియాజ్ డిమాండ్ చేశారు. వారందరికీ మెడికల్ బోర్డు నిర్వహించి, గతంలో అనుసరించిన విధానంలో అన్‌ఫిట్ చేయాలని కోరారు. లేకపోతే హెచ్ఎంఎస్ కార్మికుల తరఫున పోరాటాన్ని కొనసాగిస్తుందని హెచ్చరించారు. కవిత హెచ్చరికతోనే ప్రభుత్వం దిగివచ్చింది: బోడ జనార్ధన్కార్మికుల కష్టాలను చూసి నిరవధిక దీక్షకు సిద్ధమవుతున్నట్లు కవిత ప్రకటించడంతోనే ప్రభుత్వం దిగివచ్చిందని మాజీ మంత్రి, టీఆర్ఎస్ నేత బోడ జనార్ధన్ అన్నారు. దాదాపు మూడేళ్లుగా డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కార్మిక కుటుంబాలు తీవ్ర ఆవేదనలో ఉన్నాయని చెప్పారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ మెడికల్ బోర్డు నిర్వహించి, అన్‌ఫిట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మొత్తం 2,000 దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యే వరకు నెలకు రెండుసార్లు, అనంతరం నెలకు ఒకసారి మెడికల్ బోర్డు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే కవితతో కలిసి పోరాటం కొనసాగిస్తామని, ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని బోడ జనార్ధన్ హెచ్చరించారు.

## వాల్మీకి ఆవాసంలో ఉచిత ఆరోగ్య శిబిరం



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు ) జూలై 17 :** సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగిత్యాల ధరూర్ క్యాంపు లోని వాల్మీకి ఆవాసంలో శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గుండేటి అర్జున్, చర్మవ్యాధుల నిపుణులు డా. ఎనగందుల నరేష్ ఆవాసం పూర్వ విద్యార్థి డా. నరేంద్ర (అనస్తీసియా ) దంత వైద్య నిపుణులుడా. బాశెట్టి హర్షవర్ధన్ ఆర్.ఎం.పి, పిఎంపీల సంఘం బాధ్యులు డాక్టర్ ధనుంజయ, డాక్టర్ గోపాల చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో విద్యార్థుల ఎత్తు బరువు కొలిచి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, మంచి ఆహార అలవాట్లు, ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలా జాగ్రత్త పడాలో విద్యార్థులకు వివరించారు. ఆవాస విద్యార్థుల కోసం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేసిన వైద్యులకు ఆవాస నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాస కార్యదర్శి మదన్ మోహన్ రావు, సభ్యులు డాక్టర్ ధనుంజయ, అశోక్ రావు, వెంకటేశ్వరరావు ఆవాస ప్రముఖ మల్లేశం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జయహో జగిత్యాల పోలీస్

**మానసిక వికలాంగులకు పోలీసుల చేయూత**







**( చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల):** జగిత్యాల పట్టణంలో వివిధ ప్రాంతాలలో తిరుగుతున్న మానసిక వికలాంగులను దాదాపు పది నుండి 15 మంది మానసిక వికలాంగులకు జగిత్యాల పట్టణ పోలీసులు చేయూతనిచ్చారు. పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల అనుసారం డిఎస్పి సూచనల మేరకు పట్టణంలో వివిధ ప్రాంతాలలో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న దాదాపు 14 మంది మానసిక వికలాంగులను గుర్తించి వారికి స్నానం చేయించి క్షవరము తీసేయించారు. ప్రాథమిక వైద్య పరీక్షల నిర్వహించి, అల్పాహారం, నూతన వస్త్రాలు అందివ్వడం జరిగిందన్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి నిజమైన మానసిక వికలాంగులని నిర్ధారించిన తర్వాత కోర్టులో హాజరు పరిచి ఆ తర్వాతవారిని చికిత్స నిమిత్తము హైదరాబాదులోని ప్రభుత్వ ఎర్రగడ్డ ప్రధాన ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు. వారు తొందరగా చికిత్సకు స్పందించి త్వరగా కోలుకొని వారి కుటుంబ సభ్యులతో గడపాలని ఆయన ఆశించారుఈ కార్యక్రమంలో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కర్ణాకర్, పట్టణ ఎస్సై సుప్రియ రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై మల్లేశం, ఇతర పోలీస్ సిబ్బంది చేసిన ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సాయికృష్ణ కస్టడీ మరణంపై ఎన్‌హెచ్ఆర్సీ కీలక ఆదేశాలు



**సికింద్రాబాద్, జూలై 17 ( ప్రజామంటలు):** విజయవాడకు చెందిన గాడె సాయికృష్ణ అనుమానాస్పద కస్టడీ మరణం కేసులో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రముఖ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని దాఖలు చేసిన ఫిర్యాదుపై తీవ్రంగా స్పందించిన కమిషన్, ఈ దారుణంపై తన విచారణను మరింత వేగవంతం చేసింది. కృష్ణలంక పోలీసుల అక్రమ నిర్బంధం, కస్టడీలో సాగించిన అమానుష చిత్రహింసలు, ఆపై ఆధారాల ధ్వంసానికి పాల్పడిన తీరు అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని కమిషన్ ఈ సందర్భంగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జరిపిన ప్రాథమిక విచారణలోనే ఇది స్పష్టంగా కస్టడీ మరణమేనని తేలిందని కమిషన్ తన ఉత్తర్వుల్లో నమోదు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అప్పటి సీఐ నాగరాజుతో పాటు మరికొందరు పోలీసు అధికారులను ఇప్పటికే అరెస్ట్ చేసి, సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర డీజీపీ సమర్పించిన నివేదికను కమిషన్ పరిశీలించింది. ఘటన జరిగిన సమయంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు చెందిన సీసీటీవీ హార్డ్‌డిస్క్‌లను ఉద్దేశపూర్వకంగానే మార్చేసి, ఎలక్ట్రానిక్ ఆధారాలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైన విషయాన్ని నివేదిక ద్వారా ప్రస్తావించింది. అయితే, ఇంత దారుణం జరిగినా సాయికృష్ణ మృతదేహ అవశేషాలు ఇప్పటికీ లభించకపోవడం దర్యాప్తులో అత్యంత కీలకమైన అంశమని మానవ హక్కుల కమిషన్ అభిప్రాయపడింది. బాధిత కుటుంబానికి ఖచ్చితంగా న్యాయం జరిగేలా చర్యలు ఉంటాయని స్పష్టం చేసిన కమిషన్, సిట్ దర్యాప్తులో తాము జోక్యం చేసుకోకుండానే కేసు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపింది. సాయికృష్ణ అవశేషాల గుర్తింపు, వాటి స్వాధీనంతో పాటు పరారీలో ఉన్న మిగిలిన నిందితుల అరెస్టుపై ఇప్పటివరకు సాధించిన పురోగతిపై సమగ్రమైన రెండో నివేదికను సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ డీజీపీని ఆదేశించింది. ఈ కేసులో తదుపరి పురోగతిపై రాబోయే నాలుగు వారాల్లోగా తాజా నివేదికను తమకు అందజేయాలని ఏపీ పోలీసు శాఖకు జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పష్టమైన గడువు విధించింది.

# చదువుల నిలయాలా మృత్యుకూపాలా

**తెలంగాణ ప్రభుత్వ హాస్టళ్లపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం**

**గద్వాల గురుకుల ఘటనపై 'ఎన్‌హెచ్ఆర్సీ' సీరియస్..**

**ఐఏఎస్ అధికారులకు నోటీసులు**



**సికింద్రాబాద్, జూలై 17 ( ప్రజా మంటలు):** తెలంగాణలోని ప్రభుత్వ గిరిజన హాస్టళ్లలో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) నిప్పులు చెరిగింది. హాస్టల్ సిబ్బంది, కాంట్రాక్టర్ల అడ్డగోలు నిర్లక్ష్యానికి గిరిజన బిడ్డలు బలి కావాలా అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల గద్వాల గురుకులంలో కుళ్లిన అన్నం తిని 12 మంది గిరిజన విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికావడం, అందులో ఒకరి పరిస్థితి విషమంగా మారిన ఉదంతం దేశ రాజధాని ఢిల్లీని కదిలించింది. 13 ఏళ్ల పసిపిల్లలు హాస్పిటల్ బెడ్లపై ప్రాణ సంకటంలో కొట్టుమిట్టాడుతుంటే అసలు ఎస్టీ సంక్షేమ శాఖ ఏం చేస్తోందంటూ ఎన్‌హెచ్ఆర్సీ తీవ్రంగా మండిపడింది. అధికారుల పర్యవేక్షణ లోపం, గురుకులాల్లో భద్రత శూన్యంగా మారడంపై ప్రముఖ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని దాఖలు చేసిన ఫిర్యాదుపై కమిషన్ అత్యంత వేగంగా స్పందించింది. ఈ ఘోరానికి బాధ్యులైన ఐఏఎస్ అధికారులపై ఎన్‌హెచ్ఆర్సీ గట్టి చర్యలకే ఉపక్రమించింది. ఉన్నతాధికారులు సబ్యసాచి ఘోష్, రిజ్వాన్ బాషాలకు నేరుగా నోటీసులు జారీ చేస్తూ షాక్ ఇచ్చింది. ప్రభుత్వ హాస్టళ్లలో విషపూరిత ఆహారం, మురికి నీరు సరఫరా చేస్తూ విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న గద్వాల గిరిజన హాస్టల్ నిర్వాహకులపై తక్షణమే క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ అమానుష ఘటనపై తూతూమంత్రంగా కాకుండా పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, రెండు వారాల లోపు సమగ్ర నివేదికను తమ ముందుంచాలని తెలంగాణ ప్రభుత్వానికి కచ్చితమైన ఆర్డర్స్ జారీ చేసింది. గద్వాల జిల్లా కలెక్టర్‌తో పాటు గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులపై తీసుకున్న చర్యలకు సంబంధించిన 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్' సబ్మిట్ చేయాల్సిందేనని జాతీయ మానవ హక్కుల కమిషన్ గడువు విధిస్తూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

## తెలంగాణ చరిత్రను పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది

**డాక్టర్ జీ. చిన్నారెడ్డి**

**దక్కన్ ప్రాంత అజేయ యోధుడు తుర్రేబాజ్ ఖాన్**




**హైదరాబాద్, జూలై 17 (ప్రజా మంటలు):** దక్కన్ ప్రాంతంలో అజేయ యోధుడిగా పేరుగాంచిన తుర్రేబాజ్ ఖాన్ పోషించిన పాత్రను మరువలేమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో "స్టార్మింగ్ ది బ్రిటిష్ రెసిడెన్సీ" అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1857 జూలై 17న దేశభక్తి కలిగిన ధైర్యవంతుల బృందానికి తుర్రేబాజ్ ఖాన్ నాయకత్వం వహించి బ్రిటిష్ రెసిడెన్సీపై దాడి చేశారని గుర్తు చేశారు. ఈ ఘటన దక్కన్ ప్రాంతంలో జరిగిన ప్రసిద్ధ సిపాయిల తిరుగుబాటుకు ప్రతిధ్వనిగా నిలిచిందన్నారు. గత చరిత్ర నుంచి స్ఫూర్తి పొందేందుకే ఇలాంటి చారిత్రక సంఘటనలను స్మరించుకుంటున్నామని చిన్నారెడ్డి తెలిపారు. గతంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు అనుమతులు లభించేవి కావని ఆయన గుర్తు చేశారు. నల్గొండకు చెందిన మౌల్వీ అల్లావుద్దీన్‌తో కలిసి తుర్రేబాజ్ ఖాన్ బ్రిటిష్ రెసిడెన్సీపై దాడి చేశారని వివరించారు. తెలంగాణ నుంచి అండమాన్‌లోని 'కాలాపాని'గా పేరుపొందిన సెల్యులర్ జైలుకు పంపబడిన తొలి యోధుడు మౌల్వీ అల్లావుద్దీన్ అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు టి. వివేక్, చరిత్ర ప్రొఫెసర్ డాక్టర్ కె. పద్మ రచించిన "తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం -- సంక్షోభ సంవత్సరాలు" పుస్తకాన్ని డాక్టర్ చిన్నారెడ్డి ఆవిష్కరించారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని, న్యాయం కోసం అన్వేషణను తిరిగి రగిలించడానికి ఈ పుస్తకం సరైన సమయంలో వెలువడిందని ఆయన అన్నారు. తెలంగాణ చరిత్రను పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని చిన్నారెడ్డి నొక్కిచెప్పారు. ఈ దిశగా చేపట్టే చారిత్రక పరిశోధనలకు కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులను కేటాయించాలని సూచించారు. 2009--2014 మధ్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలకమైన అనేక నమోదు కాని వాస్తవాలు, సంఘటనలను రచయితలు వెలుగులోకి తీసుకువచ్చారని ఆయన అభినందించారు. తెలంగాణ చరిత్ర నిర్మాణంలో ఉన్న లోటును ఈ గ్రంథం పూరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సెమినార్‌లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్ క్యాప్టెన్ (డాక్టర్) ఎల్. పాండు రంగా రెడ్డి, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీమతి సూర్య ధనుంజయ, పుస్తక రచయితలు టి. వివేక్, డాక్టర్ కె. పద్మ, చరిత్ర ప్రొఫెసర్ డాక్టర్ పి. అరుణ, చరిత్ర విభాగాధిపతి ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ ఆర్. సురేందర్ రెడ్డిని సత్కరించారు.

